క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మేయర్ విజయలక్ష్మి, మమతా తదితరులు

అబిడ్స్: గ్రీన్ ఇండియా ఛాలెంజ్ పోస్టర్లను మేయర్ విజయలక్ష్మి, మాజీ కార్పొరేటర్ మమతా గుప్తాలు శనివారం ఆవిష్కరించారు. జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఎంపీ జోగునపల్లి సంతోష్ చేపడుతున్న గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని ఈ పోస్టర్లను ఆవిష్కరించారు. మహిళా దినోత్సవం రోజు పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేస్తామన్నారు.

మార్కెట్‌లోకి హోండా న్యూ సిటీ ఈ-కార్



లక్డీకాపూల్: హోండా కార్స్ ఇప్పుడు న్యూ సిటీ (పెట్రోల్), న్యూ సిటీ ఈ-కార్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. సేఫ్ డ్రైవింగ్‌కు అనుకూలంగానే కాకుండా అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెంట్ సిస్టమ్ సదుపాయంతో ఈ-కార్ వచ్చిందని హోండా కార్ సీఈఓ టకుయా సుమురా తెలిపారు. అంతే కాకుండా పలు సరికొత్త ఫీచర్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. హోండా కార్ ప్రియులకు ఈ న్యూ సిటీ కారు ఎంతో ఆకట్టుకుంటుందన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన నానల్‌నగర్, టోలిచౌకిలో ఇంటింటికీ తిరిగారు. ఈ సందర్భంగా ఆయన నల్లాలో తాగునీటిపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు తమకు నీరు లో ప్రెషర్‌లో వస్తుందని ఆయన దృష్టికి తెచ్చారు. అంతేకాకుండా మరికొందరు నల్లాలో వస్తున్న నీరు తమ తాగునీటి అవసరాలు సైతం తీర్చడం లేదని ఆయనతో మొరపెట్టుకున్నారు. బస్తీలు, కాలనీలలోని ఎగువ ప్రాంతాల్లో ఉన్న ఇళ్లలో 15 నిమిషాలు నల్లాలో నీరు రావడం లేదని ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. కాగా పలు సాంకేతిక కారణాల వల్ల నీటి సరఫరాలో అవాంతరాలు ఎదురవుతున్నాయని, అయితే దీనిని నివారించడానికి తాను అన్ని రకాల చర్యలు తీసుకున్నానన్నారు. వేసవి ప్రారంభానికి కంటే ముందే తాను జలమండలి కార్యాలయ, క్షేత్ర స్థాయి సిబ్బందితో మాట్లాడి అవసరమైనఅన్ని చర్యలు తీసుకున్నామన్నారు. అయితే ఎత్తైన ప్రాంతాల్లో ఉన్న ఇళ్లలో లో ప్రెషర్ సమస్య కూడా పూర్తిగా పరిష్కరించడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. లో ప్రెషర్ సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో పవర్ బూస్టర్లు ఏర్పాటు చేశామన్నారు. జలమండలి అధికారులు ఇళ్లలో నల్లాలు తనిఖీ చేసే సమయంలో విద్యుత్ మోటార్లను స్వాధీనం చేసుకోవడమే కాకుండా వాటిని వాడుకున్న వారిపై కేసులు పెట్టాలని ఆయన స్థానికులకు తెలిపారు. ఆయన వెంట జలమండలి డీజీఎం ఖాజా జౌహార్ అలీ తదితరులున్నారు.



ఓ ఇంట్లో నల్లాలో వస్తున్న నీటిని గమనిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

టోలిచౌకిలో ట్రాఫిక్ స్పెషల్ డ్రైవ్

గోల్కొండ: అక్రమ పార్కింగ్‌లను ఏ మాత్రం సహించేది లేదని టోలిచౌకి ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ విష్ణువర్ధన్ అన్నారు. శనివారం ఆయన తన సిబ్బందితో టోలిచౌకి చౌరస్తా, దాని పరిసరాలలో అక్రమ పార్కింగ్‌లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కొంత కాలం క్రితం టోలిచౌకి రుమాన్ హోటల్, రహమత్ హోటల్‌లతో పాటు టోలిచౌకి ఫ్లై ఓవర్ కింది భాగంలో వాహనాల అక్రమ పార్కింగ్‌ను పూర్తిగా నిషేధించారు. దీని కారణంగా దర్గా, గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు రుమాన్ హోటల్ ముందుగా మెహిదీపట్నం వైపుకు వెళ్లాయి. అయితే కొన్ని రోజుల నుంచి మళ్లీ రుమాన్ హోటల్ ముందు అక్రమ పార్కింగ్ మళ్లీ మొదలైంది. దీనిపై ఫిర్యాదులు రావడంతో ఆయన తన సిబ్బందితో కలిసి అక్రమంగా పార్కింగ్ చేసి ఉన్న వాహనాలను స్వాధీనం చేసుకుని గోషామహల్‌కు తరలించారు.



స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వాహనాలను తరలిస్తున్న దృశ్యం

కవులు, రచయితలకు వారి కవితలపై పోటీలు



రవికుమార్

అబిడ్స్: అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని కవులు, రచయితలకు వారు రచించిన కవితలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు విద్యావేత్త, నవభారత్ నిర్మాణ్ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు రవికుమార్ పేర్కొన్నారు. మార్చి 28వ తేదీలోపు పలువురు కవులు, రచయితలు రచించిన పుస్తక సంపుటీలను ఇంటర్నేషనల్ బెనెవలెంట్ రిసర్చ్ ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ కిరణ్‌కుమార్‌కు పంపించాలని అందరికీ సూచనలు చేశామన్నారు. శనివారం తన కార్యాలయంలో రవికుమార్ మాట్లాడుతూ.. కవులు, రచయితలను ప్రోత్సహించేందుకు నవభారత్ నిర్మాణ్ సంఘం ఆధ్వర్యంలో తరచూ వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మాతృభాషను కాపాడేందుకు, మాతృభాషను అభివృద్ధి పరిచేందుకు వారి కృషి అమోఘమని కొనియాడారు.

7న మిల్లెట్స్‌పై ఉపన్యాసం

సంతోష్‌నగర్: అంతర్జాతీయ మిల్లెట్ సంవత్సరం (ఐవైఎం) 2023 సందర్భంగా ఈనెల 7న కంచన్‌బాగ్ డీఆర్‌డీఓ టౌన్‌షిప్ ఆడిటోరియంలో 'మిల్లెట్స్ అండ్ దాని ఆరోగ్య ప్రయోజనాలు'అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్టేట్ మేనేజ్‌మెంట్ యూనిట్ (ఆర్‌అండ్‌డీ) డాక్టర్ షేక్ గౌస్ మోహీద్దీన్ తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నిర్వహించే ఈ ఉపన్యాస కార్యక్రమానికి ప్రముఖ వక్త పద్మశ్రీ డాక్టర్ ఖాదర్ వలీ పాల్గొంటారన్నారు. హైదరాబాద్‌లోని అన్ని ల్యాబ్స్, ఎస్టాబ్లిష్‌మెంట్ల ఉద్యోగులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలన్నారు.

కల్యాణ మండపం భూమి పూజకు ఆహ్వానం

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ మహంకాళి మాతేశ్వరీ ఆలయ ప్రాంగణంలో రెండేళ్ల క్రితం మంజూరు చేసిన మల్టీ పర్పస్ ఫంక్షన్‌హాల్ (కల్యాణ మండపం) నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు హాజరవ్వాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు జనగామ మధుసూదన్ గౌడ్ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కోరారు. ఈ మేరకు కమిటీ ప్రతినిధులతో శనివారం మంత్రిని కలిసి సన్మానించడంతో పాటు శంకుస్థాపనకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌గౌడ్ మాట్లాడుతూ.. ఆలయ ప్రాంగణంలో ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. ఈనెల 16వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున.. అది ముగిశాక వస్తానని.. యుద్ధప్రాతిపదికన నిర్మాణం చేసుకుందామని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి కీర్తి నరేందర్ ముదిరాజ్, సభ్యులు బత్తుల సతీష్ గౌడ్, భవానీ శంకర్, హరికృష్ణ, ఆనంద్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి తలసానిని సన్మానిస్తున్న మధుసూదన్‌గౌడ్ తదితరులు

విరాళం అందజేత



సీఎం కేసీఆర్‌కు నగదును అందజేస్తున్న ప్రొఫెసర్ దశరథ్‌రెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: బాన్సువాడ నియోజకవర్గంలోని తిమ్మాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి అబిడ్స్ రెడ్డి జనసంఘం అధ్యక్షుడు వి.నర్సింహారెడ్డి, గౌరవ సలహాదారులు ప్రొఫెసర్ కంచర్ల దశరథరెడ్డి ఇద్దరు కలిసి రూ.12 లక్షలు అందజేశారు. ఈ మేరకు శనివారం సీఎం కేసీఆర్‌ను కలిసి నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాజ్య సభ సభ్యులు సురేష్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యేలు గంపా గోవర్ధన్, జీవన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ఆలయ కర్తలు పోచారం శంభురెడ్డి, పోచారం భాస్కర్‌రెడ్డి, డి.విఠల్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత శ్రీరాములు రచించిన సంగీతామృత వర్షిణి పుస్తకావిష్కరణ సభ శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మ్యూజిక్ అకాడమీ విద్యార్థుల గీతాలాపన ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ అన్నవరపు రామస్వామి, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, కర్ణాటక సంగీత విద్వాంసురాలు శేషులత, గేయ రచయిత కృష్ణమోహన్, కిన్నెర ఆర్ట్ థియేటర్ కార్యదర్శి మద్దాలి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రామస్వామి తదితరులు

పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన

లంగర్‌హౌజ్: విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని లంగర్‌హౌజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అన్నారు. హెచ్ఎంఎస్‌డబ్ల్యూ ఖైరతాబాద్ జోన్ హెడ్ ప్రశాంత్ మిశ్రా సారథ్యంలో హెచ్ఎంఎస్‌డబ్ల్యూ కార్వాన్ సర్కిల్–13 ఇన్‌చార్జి మురళీ చక్రవర్తి, లంగర్‌హౌజ్ వార్డు ఫీల్డ్ అసిస్టెంట్ ముత్యాల నరేష్ ఆధ్వర్యంలో లంగర్‌హౌజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ.. తమ ఇంటితో పాటు చుట్టు పక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎస్ఎఫ్ఏలు కార్తీక్, రాజేందర్ పాల్గొన్నారు.

ప్రయోగాల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

చార్మినార్: సిటీ కళాశాలలోని భౌతికశాస్త్ర విభాగం, పదార్థాల భౌతిక, రసాయన ధర్మాలను అవిచ్ఛిన్న ప్రక్రియల ద్వారా గణాంకాలు అనే అంశంపై శిక్షణ కార్యక్రమాన్ని ఇండియన్ సొసైటీ ఫర్ నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ (ఐఎస్ఎన్‌టీ) సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడిగా హాజరైన కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్ మాట్లాడుతూ.. శాస్త్రీయ పద్ధతుల్లో జరుగుతున్న ప్రయోగాలను విద్యార్థులు నిశితంగా పరిశీలించి తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రసిద్ధ పరిశోధన కేంద్రమైన డీఆర్‌డీఓ నుంచి ఈ కార్యక్రమానికి వక్తలుగా డాక్టర్ కె.శ్రీనివాస్, ఎం.వెంకట రెడ్డి, డాక్టర్ ఫణి సూర్య కిరణ్ హాజరై అవిచ్ఛిన్న ప్రక్రియల ద్వారా గణాంకాలలో జరుగుతున్న ఆధునిక పరిశోధనలను వివరించారు. మిధాని నుంచి జి.ప్రవీణ్ కుమార్ ఎన్‌డీఈ పారిశ్రామిక రంగాలలోని అనువర్తనాలను వివరించారు.



కార్యక్రమంలో రవి, విశ్వనాథ్

ఈ విధానాలను కేంద్రక పరిశ్రమలలో ఏ విధంగా ఉపయోగిస్తారో హైదరాబాద్ ఎన్ఎఫ్‌సీ సోమశేఖర రెడ్డి వివరించారు. వైద్య సాంకేతిక పరిశ్రమలలో ఎక్స్–రే ఉపయోగాలను, ఎంక్యూస్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్ సీనియర్ మేనేజర్ ఎం.రాజ నరేంద్ర వివరించగా.. ఫ్రెషర్స్‌కి ఉద్యోగ అవకాశాలను, ఆర్కిమెడిస్ గ్రీన్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ సీఈఓ సూర్య ప్రకాశ్ వివరించారు. ఎన్‌ఎఫ్‌సీఐఎల్ పూర్వ అసోసియేట్ డైరెక్టర్ మించేరి రవి, హైదరాబాద్ చాప్టర్ ఐఎస్ఎన్‌టీ వైస్ చైర్మన్ విశ్వనాథ్ మద్దిపట్లలు ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా హాజరై వారి అమూల్యమైన సందేశాన్ని ఇచ్చారు. భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎస్.ఐ.నైనా వినోదిని, డాక్టర్ డి.చిన్ని కృష్ణ, డాక్టర్ వై.వాసుదేవ రెడ్డి, డాక్టర్ కె.పర్వతాలు, డాక్టర్ ఎ.లక్ష్మీ శ్రీనివాస్ రావు, డాక్టర్ డి.సువర్ణ రవి బాతే హాజరయ్యారు.

ఘనంగా వరల్డ్ హియరింగ్ డే

సుల్తాన్‌బజార్: అప్పుడే పుట్టిన శిశువులకు నియోనేటర్ పరీక్ష ద్వారా వినికిడి సమస్యను తెలుసుకోవచ్చని కోఠి చెవి, ముక్కు, గొంతు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.శంకర్ అన్నారు. ప్రపంచ వినికిడి దినోత్సవాలను పురస్కరించుకొని శనివారం కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రి ఆడిటోరియంలో కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్స నిర్వహించుకున్న చిన్నారులతో నిర్వహించిన కార్యక్రమంలో ఈఎన్‌టీ వైద్యులు కేకును కట్‌చేసి వరల్డ్ హియరింగ్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ దేశభక్తి వేషధారణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ శంకర్ మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచి వినికిడి సమస్య ఉన్న చిన్నారులకు 2009 నుంచి 500లకు పైగా కాంక్రియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సలు నిర్వహించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఈఎన్‌టీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్ఎస్.రెడ్డి, కార్యదర్శి మౌనికా రెడ్డి, జయ, మనీష, శోభన్‌బాబు, తన్వీర్ సింగ్, డాక్టర్ వాణి, కిరణ్, నాగరాజు, వీణ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు చిన్నారులు

పే రివిజన్ 2022 అమలు చేయాలి

గోల్కొండ: ఏప్రిల్ 2022 నుంచి సవరించిన వేతనాలను చెల్లించడంతో పాటు ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చడంతో పెండింగ్‌లో ఉన్న న్యాయమైన తమ డిమాండ్లను వెంటనే ఆమోదించాలని విద్యుత్ సైబర్ సిటీ సర్కిల్ రాజేంద్రనగర్ సర్కిల్ యూనియన్ నాయకులు లక్ష్మీనారాయణగౌడ్, సయ్యద్ సుజాత్ హుస్సేన్ డిమాండ్ చేశారు. పే రివిజన్ అమలు కోసం శనివారం నానల్‌నగర్‌లోని సైబర్ సిటీ, రాజేంద్రనగర్ సర్కిళ్ల విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టీఎస్‌పీఈ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో అన్ని శాఖల విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయమైన తమ డిమాండ్లను సంస్థ యాజమాన్యం ఒప్పుకునే వరకు నిరసన కార్యక్రమాలు చేపడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సైబర్ సిటీ సర్కిల్ నాయకులు రామ్మోహన్, శ్యాంప్రసాద్, రత్నం, హరీష్, రాజేంద్రనగర్ సర్కిల్ నాయకులు అజీమ్, చంద్రశేఖర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



డబీర్‌పురా పీఎస్ పరిధిలో ఫ్లాగ్ మార్చ్



డబీర్‌పురా: డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఆర్ఏఎఫ్ బలగాలతో పోలీసులు ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ డబీర్‌పురా పీఎస్ నుంచి ప్రారంభమైన డబీర్‌పురా చున్నేకీ బట్టి, కోమటివాడి, బోధే అలీషా కిడికి, నూర్‌ఖాన్‌బజార్, గోల్ చమాన్, పురానీహవేలి, ప్రిన్సెస్ ఆస్పత్రి, డబీర్‌పురా దర్వాజా మీదుగా చంచల్‌గూడ వరకు కొనసాగింది. మలక్‌పేట్ ఏసీపీ శ్యాంసునందర్, డబీర్‌పురా డీఐ రాంబాబు, ఎస్సైలు సుదర్శన్, అనిల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయండి'



శ్రీనివాస్

అబిడ్స్: వాటర్‌బోర్డులో నూతనంగా ప్రవేశపెట్టిన ఏఎంఎస్ (యానివ్ మేయింటెనెన్స్ ఆఫ్ సెక్షన్) విధానాన్ని తక్షణమే రద్దుచేయాలని తెలంగాణ యునైటెడ్ కాంట్రాక్టర్స్ ఫోరం సెక్రటరీ, మీడియా ఇన్‌చార్జి పోల్కం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వాటర్‌బోర్డు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత బోర్డు ఎండీ దానకిశోర్ కాంట్రాక్టర్ల కడుపులు కొట్టే విధంగా ఏఎంఎస్ విధానాన్ని ప్రవేశపెట్టాలన్నారు. యూనియన్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, చీఫ్ సెక్రటరీ శాంతకుమారి, బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్, కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి వినతి పత్రాలు అందజేశామని తెలిపారు.

మెడికో ప్రీతికి ఘన నివాళి



గోల్కొండ: రాష్ట్రంలో ప్రతిరోజూ అమాయక విద్యార్థులు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా బలవుతున్నారని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. సైఫ్ వేధింపులకు ప్రాణాలు కోల్పోయిన మెడికో ప్రీతికి బీజేపీ ఆధ్వర్యంలో శనివారం గుడిమల్కాపూర్ వద్ద క్యాండిళ్లతో పీస్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నో కళాశాలలో యాజమాన్య వేధింపులను తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రీతి చిత్రపటంతో క్యాండిల్ ర్యాలీ గుడిమల్కాపూర్‌లోని వీధుల్లో కొనసాగింది. ఈ కార్యక్రమంలో నామా యాదగిరి, శ్రీకాంత్ సాగర్, రాధాకిషన్ యాదవ్, అశ్విన్ మోది, పవన్ సింగ్ లోద్ తదితరులున్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి రిమాండ్

గౌలిపురా: మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడిని శనివారం మొఘల్‌పురా పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ శివకుమార్ వివరాల ప్రకారం.. సుల్తాన్‌షాహీ ప్రాంతానికి చెందిన ఎం.ఎ.రజాక్ ఫారూఖీ (45) గిఫ్ట్‌షాపును నిర్వహిస్తున్నాడు. తలాబ్‌కట్టాకు చెందిన ఓ మైనర్ బాలిక తన సోదరి జన్మదినం సందర్భంగా ఈ నెల 3న బెలూన్లను కొనుగోలు చేసేందుకు ఫారూఖీ దుకాణానికి వెళ్లగా ఫారూఖీ మైనర్‌పై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలపగా వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడు రజాక్ ఫారూఖీపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

నేడు కుస్తీ పోటీల ముగింపు



కరచాలనం చేస్తున్న దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య

చార్మినార్: కొత్వాల్ కేసరి కుస్తీ చాంపియన్‌షిప్ ముగింపు కార్యక్రమం ఆదివారం సాయంత్రం జరగనుందని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య తెలిపారు. ఈ మేరకు శనివారం కుడా స్టేడియంలో జరుగుతున్న కుస్తీ పోటీల రెండో రోజు కార్యక్రమానికి ఆయన హాజరై పోటీల్లోని వస్తాదులకు కరచాలనం చేసి బెస్ట్ ఆఫ్ లక్ చెప్పారు. కొద్దిసేపు వస్తాదుల కుస్తీ పోటీలను తిలకించిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆదివారం సాయంత్రం 7 గంటలకు కుస్తీ పోటీల ముగింపు కార్యక్రమం ఉంటుందని.. నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్‌తో పాటు పలువురు ఐపీఎస్ అధికారులు పాల్గొంటారన్నారు. వివిధ కేటగిరిలలో విజయం సాధించిన విజేతలతో పాటు టైటిల్ విన్నర్‌కు కమిషనర్ చేతుల మీదుగా నగదు బహుమతి, మెడల్, సర్టిఫికెట్‌ను అందజేయనున్నామన్నారు.

శుభాకాంక్షలు

చాంద్రాయణగుట్ట: ఛత్రినాక పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన భోజ్యానాయక్‌ను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆకుల శ్రీనివాస్ శనివారం సత్కరించారు. ఈ మేరకు టీఆర్ఎస్‌వీ పాతబస్తీ ఉపాధ్యక్షుడు రాసం దిలీప్‌కుమార్, సంఘ సేవకుడు సాప కృష్ణతో కలిసి ఇన్‌స్పెక్టర్ పూలమల వేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు.



ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ భోజ్యానాయక్‌ను సన్మానిస్తున్న ఆకుల శ్రీనివాస్

స్ట్రీట్ వెండర్ల సమస్యలు పరిష్కరించండి



డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మమతా గుప్తా తదితరులు

అబిడ్స్: స్ట్రీట్ వెండర్ల సమస్యలు పరిష్కరించాలని గోషామహల్ 14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్‌కు మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మమతా గుప్తా మాట్లాడుతూ.. ఎంతో మంది స్ట్రీట్ వెండర్లు వ్యాపారాలను తిరిగి కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పేద, బడుగువర్గాల వారికి అనుకూలంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సానుకూలంగా స్పందించారు. సంబంధిత శాఖల అధికారులతో కలిసి స్ట్రీట్ వెండర్లకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని మమతాగుప్తాకు ఆయన హామీ ఇచ్చారు.

సిటీ కళాశాలలో సామాజిక శాస్త్రాల పరిశోధనపై కార్యశాల



కార్యక్రమంలో పాల్గొన్న ఉస్మానియా విశ్వవిద్యాలయ చరిత్ర శాఖాధిపతి ఆచార్య అంజయ్య తదితరులు

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాలలో చరిత్ర శాఖ ఆధ్వర్యంలో సామాజిక శాస్త్రాలలో పరిశోధన పద్ధతులపై శనివారం జాతీయ కార్యశాల నిర్వహించారు. ఇందులో వక్తలుగా ఉస్మానియా విశ్వవిద్యాలయ చరిత్ర శాఖాధిపతి ఆచార్య అంజయ్య పాల్గొని సామాజిక శాస్త్రాలలో వివిధ పరిశోధన పద్ధతుల పైన, సమాచార సేకరణ, వనరుల తదితర అంశాలపై ప్రసంగించారు. అనంతరం జరిగిన సమావేశంలో మనూ ఉర్దూ విశ్వవిద్యాలయ సోషియాలజీ ఆచార్యులు డాక్టర్ కె.ఎం.ఖాజా జియా మైనర్/మేజర్ రీసెర్చ్ ప్రాజెక్ట్ ప్రతిపాదనల తయారీలో పరిగణలోకి తీసుకోవాల్సిన అంశాలైన సాహిత్య సమీక్షా, ఫండింగ్ ఏజెన్సీల సమాచారం, పరికల్పనకు సంబంధించిన విషయాలపై చర్చించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఐజాజ్ సుల్తానా మాట్లాడుతూ.. అధ్యాపకులు పరిశోధనలపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ సుదక్షిణ మాట్లాడుతూ.. సామాజిక శాస్త్రాలలో పరిశోధన ఇంకా ముందుకు సాగాల్సిన అవసరముందని... ఈ కార్యక్రమం అధ్యాపకులకు పరిశోధనపై మంచి అవగాహన కల్పించిందన్నారు. ముగింపు సమావేశంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాల భాస్కర్ మాట్లాడుతూ.. సామాజిక శాస్త్రాలలో పరిశోధన పద్ధతులపై ఇలాంటి కార్యక్రమం జరగడం మంచి పరిణామమని.. ఇటువంటి అవకాశాలను అందిపుచ్చుకొని అధ్యాపకులు పరిశోధనలు సాగించాలన్నారు. ఈ కార్యశాలకు రాష్ట్రంలోని వివిధ డిగ్రీ కళాశాలల నుంచి అధ్యాపకులు హాజరయ్యారు. సిటీ కళాశాల అన్ని విభాగాల్లో అటు విద్యార్థి కేంద్రక, ఇటు అధ్యాపకులకు బహు విధాల ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.